# పాస్‌వర్డ్ పజిల్

పాస్ బుక్కులూ, పాస్‌పోర్ట్‌లూ, పాస్‌వర్డ్‌లూ గురించి విన్నాం కానీ, పాస్‌వర్డ్ పజిల్స్ గురించి ఎప్పుడూ వినలేదు అని కొందరు అనుకుంటున్నారని నాకు తెలుసు.

ఇది క్రాస్ వర్డ్ పజిల్ గురించి అసలు కానే కాదు.

మరి పాస్‌వర్డ్‌లతో పజిల్ ఏమిటి?

0 0 0

ఇది పాస్‌పోర్ట్‌ల యుగమే కాదు, పాస్‌వర్డ్‌ల యుగం కూడాను. ఇండియాలో తక్కువ శాతం జనాభా కంప్యూటర్లు వాడుతున్నారు కానీ, అమెరికాలో ఇది చాల ఎక్కువ. ఆస్టిన్ నగరానికి 'మోస్ట్ వైర్డ్ సిటీ' అని పేరు కూడా వుంది, ఈ వూళ్ళో వున్నన్ని ఇంటర్నెట్ కనెక్షన్లు అమెరికాలో ఏ వూళ్ళోనూ లేవని. మరి వీళ్ళందరూ, నాలాగా కంప్యూటర్ మీద కథలు వ్రాసుకునే వాళ్ళు కాదు కదా! మరేం చేస్తున్నారు? వార్తలు చదువుకోవటం, పాటలు వినటం, సినిమాలు చూడటం లాటివెన్నో చేస్తున్నా, ఇంకా చాల వున్నాయి. నేను ఆఫీసు పనులూ, తత్సంబంధమైన వ్యాపార లావాదేవీల గురించి వ్రాయటం లేదు. ఈ వ్యాసం అంతా మనం కంప్యూటర్ మీద చేసే స్వంత పనుల గురించే.

ఆస్టిన్ నగరంలో రోజూ తనకి కావలసిన ముఖ్యమైన పనులు కంప్యూటర్ మీద చేసుకునే ఒక సగటు మనిషి అవసరాలు చూద్దాం. నేను సౌలభ్యం కోసం పుంలింగంలో వ్రాస్తున్నా, వ్రాస్తున్నవన్నీ లింగ బేధం లేకుండా ఆడా మగా అందరికీ వర్తిస్తాయని ముందుగానే చెప్పాలి.

ఈ సగటు మనిషికి కంప్యూటర్ ఆన్ చేయగానే ఒక 'లాగిన్' పేరూ, పాస్‌వర్డ్ వుంటాయి. కనీసం ఒక ఈమైల్ అడ్రస్ వుంటుంది. దానికింకొక పాస్‌వర్డ్. సాధారణంగా రెండు బాంకుల్లో ఎకౌంట్లు. ఆన్‌లైన్ బాంకింగ్ చేస్తాడు కనుక రెండిటికీ రెండు పాస్‌వర్డ్‌లు. ఇంకో రెండు స్టాక్ బ్రోకర్ ఎకౌంట్లు. ఆ రెంటికీ చెరొక పాస్‌వర్డ్. కొన్ని మ్యూట్యుయల్ ఫండ్స్, ఆ కొన్నిటికీ అన్ని పాస్‌వర్డ్‌లు. మెడికల్ ఇన్సూరెన్స్ వెబ్‌సైట్‌కి ఒకటి, మైల్ ఆర్డర్ ప్రిస్క్రిప్షన్ వెబ్‌సైట్‌కి ఇంకొకటి. నాలాటి వాడికయితే, కొన్ని తెలుగు వెబ్ మాగజైన్లు, సాహిత్యం సంగీతం అందించే తెలుగు వెబ్‌సైట్లూ... ఇలా ఇంకొన్ని. ఈమధ్య కొన్ని వెబ్ ఫోన్ సర్వీసులూ, రకరకాల చాటింగులూ ఎక్కువయిపోయాయి. వాటికి కొన్ని పాస్‌వర్డ్‌లు. మొత్తం

తడవకుండానే మోపెడు.

మరిన్ని పజిలింగ్ పాస్‌వర్డ్‌లని గుర్తు పెట్టుకోవటమెలా? ఏదయినా సులభమైన పద్ధతి వుందా?

ఎంతోమంది ఎన్నో రకాలుగా గుర్తుపెట్టుకుంటారు. అన్నిటికీ ఒకే పాస్‌వర్డ్ పెట్టుకుంటే పోలా అంటారు కొందరు.

ఒక విధంగా చూస్తే అదీ మంచిది కాదు. అది ఎవరికైనా తెలిసిపోతే, ఇటు మీ బాంక్ బాలన్స్ గోవిందా, అటు మీ క్రెడిట్ కార్డ్‌లు వాడేస్తారు... ఇలా పిడక్కీ, బియ్యానికీ ఒకే మంత్రం పనికిరాదు. ఇంకో సమస్య ఏమిటంటే, కొన్ని వెబ్‌సైట్లు మీ పాస్‌వర్డ్ ఆరు అక్షరాలే వుండాలంటే, కొన్ని ఆరు అక్షరాలూ కనీసం ఒక నెంబరూ వుండాలంటాయి. కొన్ని వెబ్‌సైట్లు సంవత్సరానికి ఒకసారో రెండుసార్లో మీ పాస్‌వర్డ్‌ని మార్చమంటాయి కూడాను. అలా మార్చుకుంటూ పోతే, మళ్ళీ రకరకాల పాస్‌వర్డ్‌లు తయారవుతాయి. వ్యవహారం మొదటికొస్తుంది. ఇవన్నీ పడలేక నాలాటి వాళ్ళు, అన్నీ ఒక చోట వ్రాసుకుని, అవి మారినప్పుడల్లా మార్చుకుంటూ, ఆ కాగితాన్ని భద్రంగా దాచుకుంటారు.

ఎంతమంది ఎంత జాగ్రత్తగా వున్నా, కంప్యూటర్ హేకర్లు (అంటే కంప్యూటర్లోకి పరకాయ ప్రవేశం చేసి, మన జాతక మంతా దొంగతనం చేసే వాళ్ళు), వాళ్ళు చేసే పని వాళ్ళు చేస్తూనే వుంటారు. మరేం చేయాలి బాబూ!

0 0 0

ఈ విషయం మీద నా పరిశీలన కొంచెం ఎక్కువయి, ఈ మధ్య కొంత పరిశోధన కూడా చేశాను. నా ఆలోచనలు సరైన పంథాలో పోతున్నాయా లేదా అని, ఒక చిన్న పరీక్ష కూడా చేశాను.

అదేమిటంటే, మొన్న శంకర్రావ్‌గారింట్లో పార్టీ రోజున ఈ విషయం తీసుకొచ్చాను మా మాటల్లో. అక్కడ వున్న వాళ్ళమందరం తెలుగువాళ్ళమే కాబట్టి, ఒకళ్ళు మాట్లాడేది ఇంకొకళ్ళు వెంటనే ఖండిస్తూ 'సరదాగా' మాట్లాడుకుంటున్నాం. అప్పుడే నా పరీక్ష మొదలుపెట్టాను.

శాస్త్రిగారితో అన్నాను - 'మీకు యాహూ ఎకౌంట్ ఈమెయిల్ వుందా?' అని.

ఆయన తల వూపాడు. 'నాకు మూడు ఛాన్సులివ్వండి. మీ పాస్‌వర్డ్ వూహిస్తాను. సరేనా?' అన్నాను.

ఆయన నవ్వుతూ, 'కానీండి. చూద్దాం' అన్నాడు.

ఎదురుగుండా కూర్చున్న ఆయన భార్య సరోజని చూసి, 'సరోజ' అన్నాను.

అతను ఆశ్చర్యంగా 'అరె. మీకు తెలిసిపోయిందే' అన్నాడు.

'అయితే నా హాట్ మైల్ పాస్‌వర్డ్ చెప్పండి' అన్నాడు శంకర్రావు కవ్విస్తూ.

కొంచెం ఆలోచించి 'నరేష్ అయే అవకాశాలు ఎక్కువ. అవునా?' అడిగాను.

'అరే! అంతకరెక్ట్‌గా ఎలా వూహించారు?' అడిగాడు.

'దీనికి ఒక షెర్లాక్ హోమ్స్ అక్కర్లేదు. చాలమంది మొట్టమొదట ఆలోచించిదేది భార్య లేదా భర్త పేరు. తర్వాత పిల్లల పేర్లు. శాస్త్రిగారికి చెప్పాక, మీరు నన్ను ఛాలెంజ్ చేశారు. అంటే శ్యామల పేరు కాదు అనిపించింది. ఒక్కగానొక్క కొడుకు నరేష్ పేరు పెట్టుకోవటంలో ఆశ్చర్యం లేదు'

0 0 0

నా పరిశీలన ప్రకారం, చాలమంది పాస్‌వర్డ్స్ వూహించటం సులభం కాకపోయినా, పెద్ద కష్టం మాత్రం కాదు. చాలమంది అని ఎందుకంటున్నానంటే, వారి ఆలోచన పాస్‌వర్డ్ రక్షణకన్నా సులభంగా గుర్తుపెట్టుకోవటం మీదే వుంటుంది. మనసంతే నువ్వే అని, ఆ మనసులోని నువ్వుని ఐదు లేదా ఆరు పాస్‌వర్డ్స్‌తో వూహించటం, ఇందాక చెప్పినట్టు సాధ్యం కాకపోయినా అసాధ్యం మాత్రం కాదు.

ఎక్కువ మంది, ముందుగా ఆలోచించేది భార్య లేదా భర్త పేరు, తర్వాత పిల్లల పేర్లు అని పైన అనుకున్నాం. తర్వాత వచ్చేవి తల్లిదండ్రుల పేర్లు. స్వంత వూరి పేరు. కొంతమంది తెలివిగా, వారి భార్య పేరో, వూరి పేరో, తర్వాత ఆవిడ పుట్టిన సంవత్సరం కూడా పాస్‌వర్డ్‌లా వాడతారు. అంటే సునీత66, భీమవరం72 అని. జంట కవుల్లా భార్య పేరూ తన పేరూ కలుపుకునే మహానుభావులు కొందరు, రాంప్రమీల అని.

ఇవి చదివాక మీలో, ఎంతమంది ఇలాటి పాస్‌వర్డ్‌లు వాడుతున్నారో చూడండి. మీకే అర్థమవుతుంది.

నేను ఓడిపోతే మీరు గెలిచినట్టు. ఎందుకంటే మీ పాస్‌వర్డ్ ఊహాతీతమని. నేను చెప్పింది మీ విషయంలో నిజమయితే, వెంటనే మీ పాస్‌వర్డ్‌ని మార్చుకోవటం అవసరం. మారిస్తే, మీకే మంచిది. అందుకని ఎలా చూసినా మీరే గెలుస్తారు.

మరి ఎలాటిది ఊహాతీతమవుతుంది? ఆలోచిస్తే మీకే ఎన్నో మంచివి తడతాయి.

అమెరికాలో అయితే తెలుగు మాటల్ని పాస్‌వర్డ్స్‌లాగా వాడుకోవటానికి మించిన రక్షణ లేదు. మా మాటల్లో వచ్చినవి కొన్ని: ఉసిరికాయ, మిరపకాయ, మల్లెపువ్వు, ఆంధ్రపుత్ర, తెలుగుబిడ్డ లేదా మీ అభిమానపాత సినిమాలు సిరిసిరిమువ్వ, ముత్యాలముగ్గులాటివి ఏవైనా సరే. మనిషి ఊహలకి అంతులేదు. మనకి సులభంగా గుర్తుకి వచ్చేవే కాక, హేకర్లకి అంతుపట్టనివి, ఆలోచిస్తే చాల దొరుకుతాయి.

ముఖ్యంగా బాంకులూ, స్టాకుల వెబ్ ఎకౌంట్ల పాస్‌వర్డ్స్, కొంచెం జాగ్రత్త పడటం అవసరం.

0 0 0